తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట యాద్రాద్రి భువనగిరి

గురువారం 24 సెప్టెంబర్ 2026

పేజీలు : 8




Follow :

## గోదావరి జలాలతో అశ్వాపురం రైతుల

# పాదాలు కడిగాం!

- మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం
- 4,300 ఎకరాలకు సాగునీటి భరోసా..
- రైట్ కెనాల్‌తో మరిన్ని వేల ఎకరాలకు నీరు
- పది నియోజకవర్గాల్లో 10 లక్షల ఎకరాలను సాగులోకి తేవడమే లక్ష్యం: మంత్రులు పొంగులేటి, తుమ్మల



**అశ్వాపురం, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** ఎన్నో ఏళ్లుగా అశ్వాపురం మండల రైతాంగం ఎదురుచూస్తున్న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం అందుబాటులోకి వచ్చింది. సీతారామ ప్రాజెక్టుకు అనుబంధంగా నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. మారెళ్లపాడు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు స్విచ్ ఆన్ చేయడంతో గోదావరి జలాలు తుమ్మలచెరువుకు చేరాయి. లెఫ్ట్ కెనాల్ ద్వారా నీటిని తరలించడంతో సుమారు 4,300 ఎకరాలకు సాగునీటి అవకాశం ఏర్పడింది.భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అశ్వాపురం మండలంలోని వివిధ గ్రామాల నుంచి రైతులు, రైతు కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలివచ్చారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంత్రులకు ఘన స్వాగతం పలికారు.రైతుల చిరకాల స్వప్నం సాకారంమారెళ్లపాడు లిఫ్ట్‌తో అశ్వాపురం మండల రైతులకు శాశ్వత సాగునీటి భరోసా కల్పించినట్లయిందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. తుమ్మలచెరువుకు గోదావరి జలాలు చేరడంతో రైతులు రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రైట్ కెనాల్‌ను కూడా పూర్తిచేసి చింతలచెరువు, జగ్గారం, ఎర్రబుక్కుల చెరువు, మిట్టగూడెం, తీగలచెరువు తదితర చెరువులకు నీరు అందించాలని కోరారు.అశ్వాపురం మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులకు సాగునీరు అందేలా ప్రణాళిక రూపొందించాలని, గ్రావిటీ కెనాళ్ల లోపాలను సరిచేసి తుమ్మలచెరువు కింద కాలువలను ఆధునీకరించాలని మంత్రులను కోరారు. గొందిగూడెం, వెంకటాపురం తదితర ఆదివాసీ గ్రామాలకు కూడా సాగునీరు అందించేందుకు అవసరమైన అనుమతులు త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.రైతును రాజు చేయడమే లక్ష్యంరైతును రాజు చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మారెళ్లపాడు లిఫ్ట్‌తో 4,300 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడిందని తెలిపారు. రైట్ కెనాల్‌ను కూడా పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. పులుసుబొంత ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, అటవీ, ఇతర అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అశ్వాపురం నుంచి పాలేరు వరకు గోదావరి జలాలుఅశ్వాపురం నుంచి పాలేరు వరకు గోదావరి జలాలను పారించి రైతుల పాదాలు కడగడమే తన జీవిత లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లను పూర్తిచేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని తెలిపారు. పది నియోజకవర్గాల్లో సుమారు 10 లక్షల ఎకరాలను సాగులోకి తీసుకురావడమే లక్ష్యమన్నారు.నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన మొక్కలను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పులుసుబొంత, దోమలవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ తదితర ప్రాజెక్టుల అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన అనుమతులు పొందేందుకు కృషి చేస్తామని తెలిపారు.మరిన్ని నిధులు తెస్తాంమహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారెళ్లపాడు లిఫ్ట్‌తో రైతులు, రైతు కూలీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పినపాక నియోజకవర్గంలో రహదారులు, మౌలిక వసతుల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టులో మిగిలిన డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులకు భూసేకరణ కొనసాగుతోందన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల సమన్వయంతో పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.మారెళ్లపాడు లిఫ్ట్ ప్రారంభంతో అశ్వాపురం మండల రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. రైట్ కెనాల్ పనులు కూడా త్వరగా పూర్తయితే మరిన్ని గ్రామాలకు సాగునీరు అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, రైతు కూలీలు పాల్గొన్నారు.



## సింగరేణి సంస్థలో ఫిట్టర్ ట్రైనీ, కేటగిరీ-1 పోస్ట్ ల భర్తీ కొరకు అంతర్గత అభ్యర్ధులకు వ్రాత పరీక్ష..



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్23 (జనంసాక్షి):**సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగా ఉన్న ఫిట్టర్ ట్రైనీ, కేటగిరీ–1 పోస్టులను అంతర్గత అభ్యర్ధులతో భర్తీ చేయుటకు ఈ రోజు తేదీ : 20.09.2026, ఆదివారము రోజున సింగరేణి మహిళా డిగ్రీ ూ పిజి కళాశాలలో వ్రాత పరీక్ష నిర్వహించటం జరిగింది. ఫిట్టర్ ట్రైనీ, కేటగిరీ–1 ‘96’ ఖాళీల కు గాను అర్హులయిన ‘84’ మంది అభ్యర్ధులకు హాల్ టికెట్లు జారీ చేయగా ‘72’ మంది అభ్యర్ధులు హాజరయ్యారు. ఈ వ్రాత పరీక్ష విజిలెన్స్ ూ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణలో, సిసి కెమెరాల నిఘా మధ్య నిర్వహించటం జరిగింది.
సింగరేణి మహిళా డిగ్రీ ూ పిజి కళాశాలలో జరిగిన ఈ పరీక్షను జిఎం(పర్సనల్) ఈఈ ూ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధర రావు మరియు జిఎం(విజిలెన్స్) ఎస్.వి.మురళీధర రాజు గార్లు పర్యవేక్షించి, పరీక్ష పూర్తిగా మెరిట్ పై ఆధారపడి ఉంటుందని, దళారులకు ఎలాంటి ప్రమేయం ఉండదని, వారిని నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు.ఈ పరీక్ష ఫలితాలు ఆదివారం రాత్రి నుంచే సింగరేణి వెబ్ సైట్ మరియు సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం వద్ద నోటీస్ బోర్డుద్వారా తెలియజేయటం జరుగుతుంది అని తెలియజేశారు.
ఈ పరీక్ష నిర్వహణ పరిశీలనలో జిఎం(పర్సనల్) ఈఈ ూ ఆర్‌సి ఏ.జే.ఎం మురళీధర రావు మరియు జిఎం(విజిలెన్స్) ఎస్.వి.మురళీధర రాజు, ఏజిఎం(పర్సనల్) పి.వేణు గోపాల రావు, డిజిఎం(పర్సనల్) బి.సమ్మయ్య, డివై.పిఎం డి.నాగేశ్వర రావు, విజిలెన్స్ ఆఫీసర్ ఎండి.గౌసుద్దీన్, మహిళా డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ శ్రీమతి డాక్టర్ జి.మంజుల మరియు ఇతర అధికారులు, విజిలెన్స్ ూ సెక్యూరిటీ సిబ్బంది, రిక్రూట్మెంట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గాలి-వాన బీభత్సం..

○మండలంలో పలుచోట్ల నష్టం ○ నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. ○ఇళ్లపై విరిగిపడిన చెట్లు.. ○ తెగిపోయిన విద్యుత్ తీగలు.. ○ భయాందోళనలో గ్రామస్తులు..



**బూర్గంపహాడ్ సెప్టెంబర్ 23 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన బలమైన ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించాయి. మండలంలోని పలు గ్రామాల్లో భారీ చెట్లు నేలకూలగా, విద్యుత్ స్తంభాలు విరిగిపడి తీగలు తెగిపోయాయి. కొన్ని చోట్ల చెట్లు ఇళ్లపై పడటంతో గృహాలు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

**- మొరంపల్లి బంజర్‌లో..**

మొరంపల్లి బంజర్ గ్రామంలో గాలుల తీవ్రతకు భారీ చెట్లు నేలకూలడంతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడి ఇళ్లపై పడటంతో ప్రజలు అప్రమత్తమయ్యారు. కొన్ని ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

**- వేపలగడ్డలోనూ అదే పరిస్థితి..**

వేపలగడ్డ గ్రామంలోనూ గాలి, వర్షం తీవ్ర ప్రభావం చూపింది. గ్రామవ్యాప్తంగా చెట్లు విరిగిపడటంతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొన్ని గృహాలు దెబ్బతిన్నాయి. రహదారులు, నివాస ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించాలి. తెగిపడిన విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు. విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులు సమన్వయంతో వెంటనే స్పందించి నేలకూలిన చెట్లను తొలగించి, విద్యుత్ స్తంభాలు, తీగలను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గాలి?వాన కారణంగా జరిగిన నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పిండిప్రోలు లో భక్తి సందడి.. ఘనంగా మహా అన్నదానం

○గణనాథుడి సన్నిధిలో మహా అన్నప్రసాద వితరణ.. పోటెత్తిన భక్తజనం
○ఓం శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా మహా అన్నదానం
○అన్నదానానికి భారీ స్పందన.. భక్తులతో కిక్కిరిసిన పిండిప్రోలు
○భక్తి, సేవాభావానికి ప్రతీకగా మహా అన్నదానం.. భారీగా తరలివచ్చిన భక్తులు



**తిరుమలాయపాలెం సెప్టెంబర్ 23 (జనంసాక్షి) :** తిరుమలాయపాలెం మండలం లోని పిండిప్రోలులో ఘనంగా మహా అన్నదానం ఓం శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు, ప్రజలకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అన్నప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణతో పిండిప్రోలులో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఓం శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు కట్టోజు బ్రహ్మాచారి కట్టోజు వెంకటాచారి కట్టోజు ఉపేంద్ర చారి వడ్లమూడి వినయ్ కుమార్ కొత్త శ్రీనివాస్ కట్టోజు మోహనా చారి కట్టు హర్షవర్ధన్ చారి కొత్త సివేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జిన్నలగూడెంలో ఘనంగా వరసిద్ధి వినాయక అన్నదాన కార్యక్రమం

○ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన జ్యూలరీ షాప్
○యజమాని.దయాకర్,లక్ష్మీ ప్రసన్న దంపతులు



**ఆళ్లపల్లి సెప్టెంబర్ 23(జనంసాక్షి)**
మండల కేంద్రంలోని జిన్నెలగూడెం గ్రామానికి చెందిన వారి సిద్ధి వినాయక నవరాత్రుల సందర్భంగా జ్యూలరీ షాప్ యజమాని దయాకర్ లక్ష్మీప్రసన్న దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారి కుటుంబ సభ్యులకు శ్రీ వరసిద్ధి వినాయకుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు తెలిపారు అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేశారని అనంతరం లడ్డు పాట నిర్వహించగా వేమూరి హరిబాబు దంపతులు(6516)రూపాయలకు దక్కించుకోగా. అనంతరం కలుశం పాట నిర్వహించగా వేమూరి రవిదంపతులు(4316)రూపాయలకు కైవసం చేసుకున్నారని అనంతరం వరసిద్ధి వినాయకున్ని ఆటపాటలతో నిమగ్నం చేశామని వరసిద్ధి వినాయక కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు, ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హరివిల్లు అపార్ట్‌మెంట్‌లో ఘనంగా గణపతి నిమజ్జనం

○ పోటీపడి ప్రసాదాలు దక్కించుకున్న భక్తులు
○ హుండీని దక్కించుకున్న చీరాల జగన్ దంపతులు

**ఖమ్మం, (జనంసాక్షి) :**
నగరంలోని కవిరాజ్ నగర్ హరివిల్లు అపార్ట్‌మెంట్‌లో గత తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ముగిశాయి. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం లడ్డూ, ఇతర పూజా సామగ్రికి నిర్వహించిన వేలంపాటలో అపార్ట్‌మెంట్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తీవ్ర పోటీ నడుమ సాగిన వేలంలో హుండీని చీరాల జగన్ – త్రిపుర దంపతులు రూ. 59 వేలకు సొంతం చేసుకోగా, ప్రతిష్ఠాత్మక గణపతి లడ్డూ ప్రసాదాన్ని జొన్నలగడ్డ వెంకట బ్రహ్మం – కృష్ణకుమారి దంపతులు రూ. 21,500లకు దక్కించుకున్నారు. స్వామివారి దోవతి–కండువాను సీఐ శంకర్ – స్వాతి దంపతులు రూ. 7,100లకు, కలశాన్ని సింగిరికొండ రాంబాబు – కవిత లక్ష్మి దంపతులు రూ. 6,800లకు, గొడుగు (ఛత్రి)ని కండిబడ్ల జగన్నాథరావు – అమృతవల్లి దంపతులు రూ. 6,100లకు వేలంలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు, విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ వాసులంతా కోలాహలంగా శోభాయాత్ర నిర్వహించి స్థానిక జలాశయంలో స్వామివారి ప్రతిమను ఘనంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలనిమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ విజ్ఞప్తి



**కల్లూరు సెప్టెంబర్ 23(జనంసాక్షి)**
సత్తుపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ,బీసీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు విద్యార్థుల భద్రతకు అవసరమైన సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ బుధవారం హైదరాబాద్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు . అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ, ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనారిటీ హాస్టళ్ల పరిస్థితులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు సురక్షితమైన, మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.

## వరద పరిస్థితులపై పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు: కలెక్టర్ దివాకర టిఎస్

○వరద పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ
○24 గంటల పాటు అందుబాటులో కంట్రోల్ రూమ్
○టోల్‌ఫ్రీ నంబర్: 1077, సెల్ నంబర్ 9063211298

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్- 23( జనంసాక్షి)**
అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
జిల్లాలోని వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు, కాలువలు తదితర ప్రాంతాల్లో నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపునకు గురయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, పరిస్థితిని బట్టి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు.
వరద నీటి ప్రవాహం అధికంగా ఉన్న వాగులు, వంకలు, కాలువలు, చెరువులు, నదులను దాటేందుకు ప్రజలు ప్రయత్నించ రాదని కలెక్టర్ సూచించారు. వరద నీటిలో వాహనాలతో ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, నీట మునిగిన ప్రాంతాలు తదితర ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు దూరంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాల్లో రాకపోకలను పర్యవేక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, వైద్య, విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
ప్రజలకు వరదలకు సంబంధించిన ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. కంట్రోల్ రూమ్‌కు అందిన సమాచారంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్: 1077, కంట్రోల్ రూమ్ సెల్ నంబర్: 9063211298 ప్రజలు ఈ నంబర్లను వినియోగించుకొని వరద పరిస్థితులు, అత్యవసర సమస్యలపై సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## దేవాలయ భూముల డిజిటల్ సర్వే ప్రారంభం

**హుజూర్‌నగర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
హుజూర్‌నగర్ మండలంలోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానానికి చెందిన భూముల డిజిటల్ సర్వే ప్రారంభమైంది.దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు ఈ సర్వే చేపడుతున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి తెలిపారు. బుధవారం ఆలయానికి సంబంధించిన భూములను సర్వే నెంబర్ల వారీగా పూర్తిగా డిజిటల్ సర్వే చేయించి హద్దులు నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు.ఈ సర్వే కార్యక్రమంలో హుజూర్‌నగర్ మండల తహసీల్దార్ బండ కవిత, డీఐ వంశీ, సర్వేయర్లు మంజుల, ముదుంబ ప్రసాద్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.









## సూర్యాపేటలో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

# ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కౌన్సిల్ పిలుపు





**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్23 (జనం సాక్షి):** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు మేరకు 23-09-2026 న బుధవారం ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదుల డెత్ /రిటైర్మెంట్ బెనిఫిట్ రు.25,00,000/- లకు పెంచాలని, న్యాయ వాదులందరికీ వైద్య సహాయం క్రింద రు.5,00,000/- మరియు జూనియర్ న్యాయవాదులకు నెలకు రు.10,000/- స్టైఫండ్ గా 5 సంవత్సరాల వరకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు పురుషోత్తమరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ( ఐలు )అధ్యక్షులు కొల్లి సత్యనారాయణ ప్రసంగిస్తూ సమాజంలో వివిధ వృత్తిలో పని చేస్తున్న వారు వారి మరణానంతరం వచ్చే ప్రయోజనాలతో పోలిస్తే మన న్యాయవాదులు అందుకునే పది లక్షల సహాయం సరిపోదని అట్టి సహాయాన్ని ఇరవై ఐదు లక్షలు ఇవ్వడానికి డిమాండ్ చేయడం సమంజసం అని, అదే విధంగా న్యాయవాదుల ఆరోగ్య భీమా రెండు లక్షల ఇవ్వడం అనేది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు రెండు లక్షలు సరిపోవని ఆరోగ్య భీమాను ఐదు లక్షలుగా పెంచవలసిన అవసరం ఉందని అదేవిధంగా, జూనియర్ న్యాయవాదులు వచ్చిన కొత్తలో వారికి కేసులు రావడం కష్టంగా ఉంటుంది వారికి ప్రతి రోజు ఉండే ఖర్చులకు చాలా ఇబ్బంది పడుతుంటారు. కావున వారికి నెలవారీ వేతనంగా కనీసం పది వేలు ఇవ్వాల్సిన ఆవశ్యకత ఉందని ఈ మూడు డిమాండ్ లు అమలు చేయడానికి బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా కేంద్ర న్యాయవాదుల సంక్షేమ నిధి నుంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐలు జాతీయ స్థాయిలో ఈ రోజు నిరసన కార్యక్రమం చేపట్టిందని తెలిపారు . అదే విధంగా ఐలు జాతీయ కౌన్సెల్ మెంబర్ జలసూత్రం శివరాం ప్రసాద్, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్ మక్కడ్, న్యాయవాదుల డిమాండ్స్ గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఐలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులు ఎం. వీ. ప్రసాదరావు, జిల్లా అధ్యక్షులు పి. కిషన్ రావు, కె. పుల్లయ్య, ఆర్. రామారావు, బి.అరుణ్ చంద్, జి. కె.అన్నపూర్ణ, ఎస్. వెంకట నర్సయ్య, టి. రమేష్, యు.అరుణ్, ఏ. రవి కుమార్, డి.రవి కుమార్, పి.రామారావు, పి. రవి వర్మ, పగిడిపల్లి రవి, కె. అభిలాష్, ఎస్.రామారావు, బి.రమేష్, లీలావతి, హిమబిందు లు పాల్గొన్నారు. అదేవిధంగా మణుగూరు కోర్ట్ కమిటీ అధ్యక్షులు పి.భాస్కర్, ఎం. శ్రీనివాసరావు, పి. నగేష్ కుమార్, జే. చొక్కారావు , ఈ.రాము పాల్గొన్నారు. అదే విధంగా భద్రాచలం కోర్ట్ కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు, ఏ. అంజలి కుమారి, యు. గౌతమ్ కుమార్ పాల్గొన్నారు. ఇల్లందు కోర్ట్ కమిటీ సభ్యులు సత్యనారాయణ పాల్గొన్నారు. కొత్తగూడెం జిల్లా కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ ముదుల్కర్ , ప్రధాన కార్యదర్శి జి. మహేశ్వరరావు ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి వారికి మద్దతు తెలిపారు. సీనియర్ న్యాయవాదులు ఎల్. సత్యనారాయణ, వి. నాగి రెడ్డి, జి.రామమూర్తి, కె. నాగేశ్వరరావు, ఎమ్. ఉషారాణి ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి మద్దతు తెలిపారు, ఐ.ఏ.ఎల్. భాద్యులు వై. ఉదయ్ భాస్కర్, భాగం మాధవరావు, ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి తమ యొక్క మద్దతు తెలిపారు. న్యాయవాద పరిషద్ భాద్యులు పీ.ఆర్. విఠల్ ఐలు డిమాండ్స్ గురించి ప్రసంగించి వారి మద్దతు తెలిపారు. బి.జె.పి. లీగల్ కౌన్సెల్ కాసాని రమేష్ ప్రసంగించి ఐలు కి మద్దతు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ సీనియర్ మరియు జూనియర్ మరియు మహిళా న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు వారికి పేరుపేరున ధన్యవాదాలు. అదే విధంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన న్యాయవాదులందిరికీ పేరుపేరున కృతజ్ఞతలు.

# ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర





**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని పూలసెంటర్ వద్ద భానుపురి గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన వేదిక వద్ద శ్రీవేదాంత భజన మందిరంలో నెలకొల్పిన వినాయకుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణేష్ నిమజ్జన శోభాయాత్రను మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదాంత భజన మందిరం వినాయకుని లడ్డూ వేలం పాట నిర్వహించారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే శ్రీనివాస్ రూ.3.21 లక్షలు వేలంపాట పాడి స్వామి వారి లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని అభినందించారు. తొలి గణపతి విగ్రహం కొలువుదీరిన వాహనాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి స్వయంగా నడిపి శోభయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ రాజ్యసభ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు జుట్టుకొండ సత్యనారాయణ, పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్, భానుపురి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వ్యాపారులు, మున్సిపల్ కౌన్సిలర్లు,మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# దాత సహకారంతో రాతోని లిఫ్టుకు అద్దె ట్రాన్స్ ఫార్మర్



## రూ. 2.50 లక్షలు భరించనున్న కనగాల సాంబశివరావు



**పెనుబల్లి సెప్టెంబర్ 23 (జనంసాక్షి)**

ఖమ్మం జిల్లా పెనుబల్లి రాతోని లిఫ్ట కు అద్దె ప్రాతిపదికన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుచేస్తున్నారు. ఈ ఏడాది ట్రాన్స్ ఫార్మర్ ను దొంగలు ఎత్తుకెళ్లటంతో రాతోని చెరువు ఆయకట్టు రైతులు పూర్తి స్థాయిలో రబీ పంటగా వరి సాగు చేయలేదు. వేసిన కొద్దిపాటి పంట కూడా వర్షా భావం వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో ప్రస్తుత పంటలను ఆదుకునేందుకు గంగదేవిపాడు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కనగాల సాంబశివరావు రైతుల బాధను అర్ధం చేసుకొని సుమారు 2.50 లక్షలు సొంత ఖర్చులతో అద్దె ట్రాన్స్ ఫార్మర్ (750 వాట్స్) ను రైతులకు అందించారు. పెనుబల్లికి తీసుకొచ్చిన ట్రాన్స్ ఫార్మర్ ను తుఫాన్ వలన బిగించలేదు. బుధవా రం రాతోని లిఫ్ట్ కమిటీ సభ్యుల సమావేశంలో కనగాల సాంబశివరావు ఈ విషయాన్ని వెల్లడి చేశారు. రాతోని,తాళ్ళ పెంట లిఫ్టులకు నూతన ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుకు టెండర్లు ప్రక్రియ పూర్తయింది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నూతన ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుకు సమయం పడుతుందని ఇరిగేషన్ శాఖ అధికారులు వెల్లడించేయడంతో కనగాల సాంబశివరావు సొంత ఖర్చులతో అద్దె ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటుచేసి రైతులను ఆదుకునేందుకు సిద్ధపడ్డారు. రైతులు సాంబశివరావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**9 మంది అరెస్ట్ - రూ.8,100 నగదు, 52 పేకముక్కలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం**



హాలియా, జనం సాక్షిసెప్టెంబర్ 23:

అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోపు తీసుకున్నట్లు హాలియా ఎస్సై సాయి ప్రశాంత్ తెలిపారు . ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన విశ్వనాధుల వెంకటాచారి ఇంటి ఆవరణలో కొంతమంది వ్యక్తులు డబ్బులను పందెంగా పెట్టి అందర్?బహార్ పేకాట ఆడుతున్నట్లు బుధవారం హాలియా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. సమాచారం మేరకు హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని దాడి నిర్వహించారు. పోలీసులను గమనించిన పేకాట నిర్వాహకులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

పట్టుబడిన నిందితులు

పాతనబోయిన సైదులు, తండ్రి కనకయ్య, వయస్సు 36 సంవత్సరాలు

అనుముల మధు, తండ్రి సైదులు, వయస్సు 32 సంవత్సరాలు

చాపల మహేష్, తండ్రి సత్యం, వయస్సు 35 సంవత్సరాలు

వజ్జ యాదయ్య, తండ్రి నరసింహా, వయస్సు 36 సంవత్సరాలు

విశ్వనాధుల సైదాచారి, తండ్రి ఆచారి, వయస్సు 36 సంవత్సరాలు

కంభంపాటి సైదులు, తండ్రి రాజయ్య, వయస్సు 40 సంవత్సరాలు

నాగిళ్ల ఆంజనేయులు, తండ్రి తిరుపతయ్య, వయస్సు 40 సంవత్సరాలు

ఈగల ప్రశాంత్, తండ్రి రోశయ్య, వయస్సు 30 సంవత్సరాలు

అనుముల దుర్గయ్య, తండ్రి అచ్చాలు, వయస్సు 43 సంవత్సరాలు

వీరందరూ ఇబ్రహీంపేట గ్రామానికి చెందినవారిగా పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, పందెం డబ్బుగా వినియోగిస్తున్న రూ.8,100 నగదు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై హాలియా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులపై తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. పేకాట, జూదం, బెట్టింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని హాలియా పోలీసులు సూచించారు. తమ పరిసర ప్రాంతాల్లో ఇటువంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం



**చిట్యాల, సెప్టెంబర్ 23(జనం సాక్షి):** నేతాజీ యువజన సంఘం ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం వద్ద చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో నకిరేకల్ శాసనసభ్యులు, చీఫ్ విప్ వేముల వీరేశం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని, యువత ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం అభినందనీయమని అన్నారు. చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో ప్రతిష్టించిన వినాయక మండపాల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, కౌన్సిలర్లు ఎర్రుల పరమేష్, కుక్కల లత,జెర్రిపోతుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు కొల్లోజు శ్రీనివాస్, సంఘం సభ్యులు రాదారపు గిరి, కడారి సత్యనారాయణ, కొత్తపెల్లి నవీన్, కొత్తూరు రాము, కొత్తపెల్లి యాదయ్య, కంచి విజయ్, నామని శ్రీను, గుండెబోయిన శ్రీనివాస్, నామని రాజేష్, గుండెబోయిన శివ సాయి, కసిరెడ్డి రాజు, కంబాలపల్లి రాహుల్, బురుగు యశ్వంత్, కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల కోసం పనిచేసిన కమ్యూనిస్టులు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**ప్రజా పోరాటాలే పబ్బతి లింగయ్యకు ఘన నివాళి**

**మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు**

**శోభనాద్రిపురంలో సీపీఎం సీనియర్ నాయకుడు పబ్బతి లింగయ్యకు ఘన నివాళి**

**రామన్నపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):** రామన్నపేట మండల ఉద్యమంలో ఐదు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం సాగించి, అనేక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన సీపీఎం సీనియర్ నాయకుడు, రామన్నపేట మాజీ వైస్ ఎంపీపీ పబ్బతి లింగయ్య అనారోగ్యంతో మృతి చెందడం పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. బుధవారం మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో పబ్బతి లింగయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించిన అనంతరం నిర్వహించిన సంతాప సభలో జాన్ వెస్లీ మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసిన కమ్యూనిస్టులు మరణించిన తర్వాత కూడా ప్రజల మధ్య చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. చిన్ననాటి నుంచి చివరి వరకు తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి, చేతబట్టిన ఎర్రజెండా ను విడిచిపెట్టకుండా పబ్బతి లింగయ్య ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. గీత కార్మిక సంఘం నాయకుడిగా కల్లుగీత కార్మి కులకు చెట్లు అందుబాటులో ఉండాలని, తాడిచెట్లపై పన్నును రద్దు చేయాలని, జీతగాళ్లు, కూలీలను సంఘటితం చేసి వారి హక్కుల కోసం పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. రామన్నపేట మండలంలో నెలకొన్న అనేక ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వాలను కదిలించిన నాయకుడు పబ్బతి లింగయ్య అని అన్నారు. ఆయన ఆశయాలు, స్ఫూర్తితో ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**ప్రజా పోరాటాలే పబ్బతి లింగయ్యకు ఘన నివాళి**

మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఉద్యమించడమే పబ్బతి లింగయ్యకు మనం అందించే ఘన నివాళి అన్నారు. ప్రజల పక్షాన నిరంతరం నిలిచిన లింగయ్య మరణం పార్టీకి, ప్రజాతంత్ర ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. గ్రామంలో అనేక ఆటుపోట్లు, నిర్బంధాలను ఎదుర్కొంటూ ధైర్యంగా ఉద్యమాలకు నాయకత్వం వహించారని తెలిపారు. అనేక మంది కమ్యూనిస్టు కార్యకర్తలను తీర్చిదిద్ది, వారిని ప్రజా ప్రతినిధులుగా గెలిపించడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు.

రామన్నపేట వైస్ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. మహానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్యను శోభనాద్రిపురం గ్రామానికి తీసుకొచ్చి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించడంలో పబ్బతి లింగయ్య కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పబ్బతి లింగయ్య స్ఫూర్తితో ప్రజలను సమీకరించి ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**ఆటపాటలతో ప్రజానాట్యమండలి నివాళి**

ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలు, అమరవీరుల గీతాలతో పబ్బతి లింగయ్య అంతిమయాత్రలో పాల్గొని ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. జహంగీర్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు





బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, పైళ్ల ఆశయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, కల్లూరి మల్లేశం, చిట్యాల మాజీ జడ్పీటీసీ, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పావునుగుళ్ల అచ్చాలు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాగిరి కిష్టయ్య, బొలగాని జయరాములు, జిల్లా కమిటీ సభ్యులు సిరిపంగి స్వామి, వనం ఉపేందర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, కందుల హనుమంతు, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, నీల ఐలయ్య, ఎం.డి. రషీద్, బొడిగె రజిత, గోగు లింగస్వామి, ఉపసర్పంచ్ ముక్కామల మల్లేశం, పుట్టల ఉదయ్ కుమార్, కొమ్ము అంజయ్య, సంగి లింగస్వామి, బీంపాక ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట (జనంసాక్షి):** వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలను పొందాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన జిలానీ వాటర్ ప్లాంట్ ను కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మొరిశెట్టి లక్షాది, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు. నాణ్యమైన, నమ్మకమైన సేవలను అందిస్తూ వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నాగు నాయక్, పంతంగి దశరథ, పడిదల రవి, రాంబాబు యాదవ్, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయి కృష్ణ, ప్రొప్రైటర్ షేక్ జిలానీ, నవీళ్ళ బాబు, శ్రీకర్ రెడ్డి, మహేష్, బండారు శేఖర్ రెడ్డి, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## రూ.3.21 లక్షలు పలికిన వేదాంత భజన మందిరం వినాయకుని లడ్డూ

**లడ్డూను దక్కించుకున్న సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు బెలిదే శ్రీనివాస్**

**సూర్యాపేట (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ శ్రీవేదాంత భజన మందిరంలో నెలకొల్పిన వినాయకుని లడ్డూను బుధవారం గణేష్ శోభాయాత్రలో భాగంగా భానుపురి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే శ్రీనివాస్ 3లక్షల 21 వేల రూపాయలకు లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మాజీ రాజ్యసభ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ చేతుల మీదుగా స్వామి వారి లడ్డూను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో కుల మతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. వేదాంత భజన మందిరంలో నెలకొల్పిన వినాయకుని విగ్రహం వద్ద పూజలు అందుకున్న స్వామి వారి లడ్డూ వేలం పాట గత సంవత్సరం కంటే ఈసారి లక్ష రూపాయలకు పైగా పెరిగింది.



# నల్లగొండ జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించాలి..

**జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి**



కనగల్లు, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా నల్లగొండ జిల్లాలో ఏలినీవో ప్రభావంతో సకాల వర్షాలు కురవక కరువు ఛాయలు విలయతాండం కొనసాగుతున్నందున నల్లగొండ జిల్లాను కరువు జిల్లాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కిసాన్ సెల్ కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జగాల్ రెడ్డి మాట్లాడుతూ నామమాత్రపు వర్షాలతో ఓపక్క పంటలు నిలువున ఎండిపోతున్నాయని , బోరు బావులల భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణములో ఎకరానికి 40 వేల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని తెలిపారు. బిజెపి నాయకులు ఎండిపోయిన పంటలను పరిశీలించడం కాకుండా కరువు ఛాయ పరిస్థితులను తమ పార్టీ ప్రక్షాన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని బిజెపి నాయకులను కోరారు.





# ఎస్ డి ఎఫ్ నిధులతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

హుజూర్‌నగర్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎస్ డి ఎఫ్ నిధుల నుండి మంజూరైన రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. హుజూర్ నగర్ పట్టణంలోని రామస్వామి గుట్ట వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, కౌన్సిలర్లు హాజరై కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హుజూర్‌నగర్ అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, ప్రత్యేక నిధులతో మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. స్థానికుల సమస్యలపై వెంటనే అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ కోల ఉదయభాను, 9వ వార్డు కౌన్సిలర్ బొల్లెద్దు జైలు కార్తీక్, స్థానిక నాయకులు పోతనబోయిన రామ్మూర్తి, భూక్యా నాగు నాయక్, 14వ వార్డు కాంటెస్టెడ్ కౌన్సిలర్ కోలపూడి జ్యోతి యోహాన్, పగిడి నాగేందర్, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శోభయాత్ర గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు

**హాలియా జనం సాక్షి సెప్టెంబర్ 23**

అనుముల మండలంలో గణనాథుడు నవరాత్రి పూజలు అందుకొని బుధవారం నాడు శోభయాత్రకు బయలుదేరినాడు. హాలియాలో ఆర్యవైశ్య సంఘం మరియు కిరాణా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని వద్ద ఆలయ అర్చకుడు రమణ శర్మ ఆధ్వర్యంలో పూజ నిర్వహించి గణనాథుని లడ్డు ప్రసాదాన్ని నాగేశ్వరరావుని భక్తుడు 62 వేలకు స్వామి ప్రసాదాన్ని దక్కించుకున్నాడు. సాయి మందిరంలో చిత్తలూరు పవన్ అనే భక్తుడు 17వేల రూపాయలకు స్వామివారి ప్రసాదాన్ని పొందాడు మహిళా కోలాటాలతో బాణాసంచా కాలుస్తూ గణపతి పప్పా మోరియా అంటూ హాలియా పురవీధుల్లో శోభ యాత్ర ఘనంగా నిర్వహించారు అనంతరం 14 మెయిల్ వద్ద ఎడమకాలంలో గంగమ్మ ఒడికి చేరినాడు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ ఆపరేషన్ అధ్యక్షులు చిటిపో లు యాదగిరి మిట్టపల్లి వాసులు కిరాణం అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టిపోలు శ్రీనివాసులు కిరాణా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు చిట్టిపోలు వెంకటేశ్వర్లు సాయిబాబా గుడి చైర్మన్ తేలపోలు శేఖర్ చీదళ్ళ లింగయ్య. వీరమళ్ళ కృష్ణయ్య. పోలా సైదులు మంచుకొండ ప్రభాకర్. రేపాల వెంకన్న కొండూరు వెంకటేశ్వర్లు ఊర వేణు . ఖ శ్రీను యాదఈ ద య్య. బచ్చు వెంకన్న చిదళ్ళ రాంబాబు పాంపాటి వెంకటేశ్వర్లు పాంపాటి శ్రీను. చీదళ్ళ శ్రీకాంత్. కొండూరు గణేష్ పో ట్టుమత్తు వెంకటేశు మహేశ్వరి కిరాణంవీ రమళ్ళ కృష్ణయ్య ఇంతకుల అధ్యక్షురాలు నిర్మల దేవి వీరమల్ల కళమ్మ చీదళ్ళ సుజాత మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ బి.చంద్రశేఖర్

○ క్రేన్లు, బోట్లు, ప్రథమ చికిత్స కేంద్రాల పరిశీలన

○ చెరువులో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలి





చిట్యాల ,సెప్టెంబర్ 23 (జనం సాక్షి): వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశంలో ప్రథమ చికిత్స సౌకర్యాలతో పాటు అన్ని సౌకర్యాలు ఉండాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెదకాపర్తి చెరువు వద్ద వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రదేశాన్ని ఆయన సందర్శించారు. విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు ఉపయోగించే క్రేన్లు, వాహనాలు, బ్యారికేడింగ్, పారిశుద్ధ్య సిబ్బంది, గజ ఈతగాళ్లు, బోట్లు, ప్రథమ చికిత్స కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రథమ చికిత్స కేంద్రంలో ఏర్పాటు చేసిన మందులను పరిశీలిస్తూ నిమజ్జనం సందర్భంగా అనుకోకుండా ప్రమాదాలు సంభవించినట్లయితే ప్రథమ చికిత్స నిర్వహించేందుకు బ్యాండేజీతో పాటు అయోడిన్, ఇతర మందులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే విగ్రహాలను నిమజ్జనం చేసిన తర్వాత పత్రి, పూలు, ఇతర చెత్తను చెరువులో వేయకుండా డస్ట్ బిన్ లో వేసే విధంగా అవగాహన కల్పించాలని, శానిటేషన్ సిబ్బంది తక్షణమే చెత్తను సేకరించి బయట వేయాలని చెప్పారు. విగ్రహాల నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఇన్చార్జి తహసిల్దార్ విజయ్, ఎంపీడీవో పాండు, నయాబ్ తాసిల్దార్ విజయ, ఎంపీ ఓ కోటేష్, పెద్దకాపర్తి సర్పంచ్ కాటన్ వెంకన్న, తదితరులు ఉన్నారు.

## పోషకాహారమే ఆరోగ్యకర సమాజానికి పునాది

### కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్





భువనగిరి, సెప్టెంబర్ 23 (జనం సాక్షి) ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాది సమతుల్య పోషకాహారమేనని 31వ వార్డు కౌన్సిలర్ సుమయ్యా తబస్సుమ్ షఫీక్ అహ్మద్ అన్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని బంజారాహిల్స్‌లో మంగళవారం నిర్వహించిన పోషకాహార వారోత్సవాల కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ, ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు రోజువారీ ఆహారంలో పోషక విలువలు కలిగిన పదార్థాలను తప్పనిసరిగా చేర్చుకోవాలని సూచించారు. కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, సరైన సమయంలో సరైన పోషకాహారం అందించడం తల్లిదండ్రులతో పాటు సమాజం మొత్తం బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు పోషకాహారం, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తల సేవలను ఆమె అభినందించారు.

**ప్రతి కుటుంబానికి అవగాహన అవసరం : ఏసీడీపీఓ యామిని**

కార్యక్రమంలో ఏసీడీపీఓ యామిని మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లల ఎదుగుదల, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై తల్లిదండ్రులకు నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది సమన్వయంతో పనిచేసి “పోషకాహారం ప్రతి ఇంటి హక్కు – ఆరోగ్యకరమైన సమాజం మనందరి లక్ష్యం” అనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, వార్డు సభ్యురాలు బానోత్ జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## న్యాయవాదుల డెత్ బెనిఫిట్‌ను రూ.25 లక్షలకు పెంచాలి

### రామన్నపేట కోర్టులో న్యాయవాదుల నిరసన

రామన్నపేట, సెప్టెంబర్ 23 (జనంసాక్షి): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ కౌన్సిల్ పిలుపు మేరకు న్యాయవాదుల సంక్షేమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట కోర్టు వద్ద న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.డి. మజీద్, ఐ లు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులకు ప్రస్తుతం అమలులో ఉన్న డెత్ బెనిఫిట్‌ను రూ. 25 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే న్యాయవాదులకు రూ.5 లక్షల వైద్య సహాయం అందించాలని, జూనియర్ న్యాయవాదులకు కనీసం ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.10,000 స్టైఫండ్ అందించాలని కోరారు. న్యాయవాదుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయవాదుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పల్వంచ జగతయ్య, నోముల స్వామి, తాటిపాముల కిరణ్ కుమార్, శంకర్, అంకం నరేష్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



## అక్కచెల్లెల్ల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు

వలిగొండ, సెప్టెంబర్ 23 (జనం సాక్షి ) మండల కేంద్రంలో వినాయక నిమజ్జనానికి అక్కచెల్లెల్ల చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్, వైద్య, ఫైర్, పారిశుద్ధ్య, భద్రతా చర్యలు చేపట్టారు. ఏర్పాట్లను ఎంపీడీవో జి. జలంధర్ రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మార్వో దశరథ, పరిశీలించారు. అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చండూరులో వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

### భక్తిశ్రద్ధల నడుమ సాగిన శోభాయాత్ర.. విఘ్నేశ్వరుడికి ఘనంగా వీడ్కోలు..



చండూరు, సెప్టెంబర్ 23 (జనంసాక్షి) చండూరు మండల వ్యాప్తంగా బుధవారం రోజున వినాయక నిమజ్జనోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ముగిశాయి. చండూరు మున్సిపల్ కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద తొమ్మిది రోజులు భక్తులు ప్రత్యేక పూజలు సమర్పించి, అనంతరం పదవ రోజు వీడ్కోలు శోభాయాత్రలను ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. జై శ్రీరామ్, గణపతి బప్పా మోరియా.. నినాదాలతో చండూరు పుర వీధులన్నీ మారుమోగిపోయాయి. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సీఐ టి. రాము, ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో శోభాయాత్ర విజయవంతంగా ముగిసింది. భక్తులు స్వామివారిని కురంపల్లి వద్ద సాగర్ ఎడమ కాలువలో నిమజ్జనం చేస్తూ, వచ్చే ఏడాది మరింత వైభవంగా ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## పెన్షన్ లబ్ధిదారుల ఎంపికపై క్షేత్రస్థాయి పరిశీలన

**మొత్తం దరఖాస్తులు 620 ఇప్పటివరకు పరిశీలించిన దరఖాస్తులు 400**

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి**

తిరుమలగిరి (సాగర్), సెప్టెంబర్ 23 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా కొత్తగా పెన్షన్లు మంజూరు చేసేందుకు చేపట్టిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో భాగంగా తిరుమలగిరి (సాగర్) మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారి అర్హతలను పరిశీలించారు. దరఖాస్తుదారుల కుటుంబ పరిస్థితులు, వయస్సు, జీవన పరిస్థితులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను నమోదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పెన్షన్ అందేలా పరిశీలన ప్రక్రియ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో మొత్తం 600 మంది పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వారిలో ఉన్నారు 400 దరఖాస్తులు ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఆయన తెలిపారు .ఈయన వెంట పంచాయతీ కార్యదర్శులు షేక్ యాసిన్ అలీ , మోదాల శేఖర్ , సుజాత ,మధు తదితరులు పాల్గొన్నారు.



## గణనాథుడి పూజలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

**భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన కేతావత్ బిల్యా నాయక్**

పి.ఏ.పల్లి,సెప్టెంబర్ 23(జనంసాక్షి) : పి.ఏ.పల్లి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణనాథుడి ప్రత్యేక పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి,స్వామివారిని దర్శించుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పోతెం సహదేవుడు,ధర్మాపురం శ్రీనివాస్,బీఆర్ఎస్ నాయకులు బొడ్డుపల్లి మహేందర్,పేర్ల రవి,మణిపాల్,వార్డు సభ్యులు నారాయణదాస్ వెంకన్న,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మదన్,అజయ్,చింటు,రాంబాబు, భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి లడ్డూను రూ.16,116కు దక్కించుకున్న న్యాయవాది పుల్లారెడ్డి



తిరుమలగిరి (సాగర్), సెప్టెంబర్ 23 (జనంసాక్షి): మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో బుధవారం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో మండల కేంద్రానికి చెందిన న్యాయవాది పుట్లూరి పుల్లారెడ్డి, అరుణ దంపతులు రూ. 16,116లకు గణనాథుడి లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను వేలంలో దక్కించుకున్న పుల్లారెడ్డి దంపతులను గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు డప్పు వాయిద్యాలతో వారి ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి అభినందించారు. రామాలయం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసే గణనాథుడి లడ్డూను వేలంలో దక్కించుకున్న భక్తుల కోరికలు నెరవేరుతాయనే నమ్మకం భక్తుల్లో ఉంది. ఈ నేపథ్యంలో స్వగ్రామంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను దక్కించుకోవాలనే కోరికతో పుల్లారెడ్డి వేలంపాటలో పాల్గొని లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో షాగం అంజిరెడ్డి , నాగేండ్ల భాస్కర్ రెడ్డి ,గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు చిక్కం సోమిరెడ్డి, శాగం వెంకట్రాం రెడ్డి, కర్న నాగిరెడ్డి, ఉప్పల మణిదీప్, బోగిరెడ్డి నాగమ్మ, దేరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేరెడ్డి కృష్ణారెడ్డి, చింతకాయల ప్రసాద్‌తో పాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి

## భద్రాచలంలో గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- గోదావరి కరకట్ట వద్ద ఏర్పాట్ల పరిశీలన
- అధికారులకు సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట ఆదేశాలు



**భద్రాచలం సెప్టెంబర్ 23 (జనంసాక్షి)**
గణేష్ నవరాత్రుల ముగింపు సందర్భంగా భద్రాచలం గోదావరి నదిలో నిర్వహించనున్న గణేష్ నిమజ్జనోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తెలిపారు. మంగళవారం రాత్రి గోదావరి కరకట్ట వద్ద నిమజ్జనం జరిగే ప్రాంతాలను ఆయన పరిశీలించి, వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు నిమజ్జనం కోసం భద్రాచలానికి వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతోపాటు ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిమజ్జన ఊరేగింపులు, కార్యక్రమాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు పోలీసు, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**- డీజేలు, బాణాసంచాపై నిషేధం**

నిమజ్జన ఊరేగింపుల సందర్భంగా డీజేలు, బాణాసంచా కాల్చడం నిషేధమని సబ్‌కలెక్టర్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ నిమజ్జనోత్సవాన్ని మత సామరస్యానికి ప్రతీకగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ, మత్స్యశాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికల రూపకల్పనకు శిక్షణ

### మూడు సంవత్సరాల సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలి

### అదనపు డీఆర్‌డీవో రవి

**దమ్మపేట సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**



వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికల తయారీలో భాగంగా మండలంలోని అన్ని గ్రామపంచాయతీల సర్పంచులు,కార్యదర్శులు,వి.బి.జి.రాంజీ సిబ్బందికి బుధవారం గండుగులపల్లి గ్రామంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రవీంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అదనపు డీఆర్‌డీవో రవి,ఏపీడీ రమణ,విజయభాస్కర్‌రెడ్డి,ఈసీ రాజు తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు డీఆర్‌డీవో రవి మాట్లాడుతూ.వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా వి.బి.జి. రాంజీ పథకం కింద సుమారు 375 రకాల పనులు ఉన్నాయని తెలిపారు.అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో రాబోయే మూడు సంవత్సరాల్లో గ్రామపంచాయతీలను సమగ్రంగా అభివృద్ధి చేసే విధంగా పక్కా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ప్రతి గ్రామపంచాయతీలో సామాజిక చిత్రపటం,వనరుల చిత్రపటం తప్పనిసరిగా రూపొందించాలని తెలిపారు.గ్రామ ప్రజలు, సర్పంచులు,వార్డు సభ్యుల భాగస్వామ్యంతో గ్రామ అవసరాలు,అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు.రూపొందించిన అన్ని గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలకు అక్టోబర్ 2న నిర్వహించే గ్రామసభల్లో ప్రజల ఆమోదం తీసుకోవాలని అధికారులకు సూచించారు.గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గండుగులపల్లి సర్పంచ్ మెచ్చా ఈదప్ప,ఎంపీవో చిరంజీవి,ఏపీవో సుధాకర్,జేఈ స్వామి,టీఏ లక్ష్మయ్య,వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు,సిబ్బంది,

## కోదాడలో వైభవంగా గణేష్ శోభయాత్ర



కోదాడ, ( జనం సాక్షి): కోదాడ పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. పట్టణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలు, ఘనమైన ఏర్పాట్ల నడుమ గణేష్ నిమజ్జన శోభయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు.. భక్తులకు కోదాడ గణేష్ నిమజ్జన కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.పట్టణంలోని ప్రధాన కూడళ్ల నుంచి ప్రారంభమైన శోభయాత్రలో రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలు,డీజేల హోరు, తీన్మార్ వాయిద్యాలు, కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ ఆకృతుల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడి విగ్రహాలను భారీ వాహనాల్లో ఉంచి ఊరేగించారు. యువతీ యువకులు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా శోభయాత్రలో పాల్గొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్, ప్రధాన బజార్ మీదుగా సాగిన ఈ ఊరేగింపును చూసేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోదాడ పోలీసులు ముందస్తుగా భారీ బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా రూట్లను మళ్లించారు.



## మధిరలో న్యాయవాదుల ధర్నా

**మధిర, సెప్టెంబర్ 23 (జనంసాక్షి):**
ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ కౌన్సిల్ (ఏ ఏ ఎల్ యు ) పిలుపు మేరకు ఈ రోజు బుధవారం మధిర కోర్టు ఎదుట న్యాయవాదులు తమ న్యాయమైన సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. డెత్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.25 లక్షలకు పెంచాలని, న్యాయవాదులందరికి వైద్య సహాయం క్రింద రూ.5 లక్షలు జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు స్టైఫండ్ గా 5 సంవత్సరాల పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చావలి రామరాజు, ఐలూ నాయకులు సీనియర్ న్యాయవాది దిరిశాల జగన్మోహన్ రావు, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, చింతల గోపాల్, వాసంశెట్టి కోటేశ్వర రావు, సతీష్, కోట జ్ఞానేష్, బోజెడ్ల పుల్లారావు, విజయ్ కుమార్, పుట్టా శ్రీనివాస్, మేడా గోపీనాథ్, మాధురీ తేజ, వంశీ తేజ, పల్లపోతు కృష్ణా రావు, మందా నాగలక్ష్మి, కోట రమేష్ మరియు న్యాయవాద గుమాలు బాహాటం వేంకటేశ్వర రాజు, కొండ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతతోనే ఆరోగ్యకర సమాజం

### బెండాలపాడులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం

**చంద్రుగొండ, సెప్టెంబర్ 23 (జనం సాక్షి):**



బెండాలపాడు గ్రామాన్ని స్వచ్ఛంగా, ఆరోగ్యంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ బొర్రా లలిత పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీల వద్ద నిలిచిన వర్షపు నీటిని తొలగించి, నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్త అవసరమైన చెత్తను వేర్వేరుగా సేకరించే విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి పొదుపు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. ప్రతి కుటుంబం తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మొక్కలు పెంచాలని సర్పంచ్ కోరారు.స్వచ్ఛ గ్రామం, ఆరోగ్య గ్రామం, అభివృద్ధి గ్రామంగా బెండాలపాడును తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శి రోహిత్, జిల్లా దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, ఉప సర్పంచ్ బానోత్ బాలు, పంచాయతీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### విద్యార్థి సంఘం బాధ్యతల నుండి వి వెంకటేష్ బహిష్కరణ :సి వై పుల్లయ్య

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 23 ( జనం సాక్షి )
పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా , సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఉండి, ఇటీవల సంవత్సర కాలం లో ఉద్యమ నిర్మాణ , రాజకీయ పనిలో లేకుండా బాధ్యతా రహితంగా వున్నాడనీ, అలానే, సమావేశాలు తన బాధ్యత లో వున్నవి చేయకపోగా, బాధ్యులు పిలిచిన సమావేశాలకు రాకుండా చాలా బాధ్యతా రహితంగా వ్యవహరించాడు. అంతే కాకుండా వ్యక్తిగతంగా సంఘం పేరు చెప్పి చందాలు వసూలు చేశాడు. ఆర్థిక అరాచకాలకు ,నిర్మాణ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన కారణంగా వంగూరి వెంకటేష్ నీ అన్ని బాధ్యతలు నుండి బహిష్కరిస్తున్నామని, ఇకనుండి వి వెంకటేష్ కు పిడిఎస్యు కు,మాస్ లైన్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేస్తున్నామని, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి సి వై పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంవత్సరకాలంగా వి వెంకటేష్ వ్యక్తిగత పనుల సాకుతో , పూర్తి కాలం కార్యకర్త బాధ్యతలను నిర్వహించకుండా, అబద్ధాలు చెపుతూ, పిడిఎస్యు కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నాడని అయన తెలిపారు.తనను అనేక సార్లు సమావేశ పరచి,లోపాలను మార్చుకోమని గుర్తు చేశామని, అయినా తనలో మార్పురాలేదని, ఇంకా నిర్మాణ తప్పిదాలకు, ఆర్థిక అరాచకాలకు పాల్పడుతూనే ఉన్నాడని, కనుక క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నాడని,వ్యక్తిగత బలహీనతలకు లోనైనాడని పిడిఎస్యు నుండి బహిష్కరి స్తున్నామని, ఇకనుండి వి వెంకటేష్ కు మాస్ లైన్ పార్టీతో కానీ, విద్యార్థి సంఘం తో కానీ ఎలాంటి సంబంధం లేదనీ తెలియజేస్తున్నామని, విద్యాసంస్థల బాధ్యులు కుడా సహకరించవద్దని తెలియజేస్తున్నామనీ అయన తెలిపారు. ఇలాంటి వ్యక్తిగత, నిర్మాణ, రాజకీయ అవకాశ వాద రాజకీయాలను పార్టీ శ్రేణులు, ప్రజాస్వామిక వాదులు వ్యతిరేకించాలని సిపిఐ ఎం ఎల్ మాస్ లైన్ ఖమ్మం జిల్లా కమిటీ తరుపున కోరుతున్నామ

# రాజపురంలో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

### బై బై గణేష్.. వచ్చే ఏడాది మళ్లీ రావాలి అంటూ నినాదాలు

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 23 (జనంసాక్షి)**
అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని రాజపురం గ్రామంలో నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన గణనాథుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, నృత్యాలతో వినాయక విగ్రహాన్ని ఊరేగింపుగా రాముడు చెరువు వద్దకు తరలించారు. ఈ సందర్భంగా భక్తులు 'బై బై గణేష్.. వచ్చే ఏడాది మళ్లీ రావాలి' అంటూ నినాదాలు చేస్తూ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం రాముడు చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. నిమజ్జన కార్యక్రమంలో మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో



పాల్గొని భక్తి ఉత్సాహాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో సురేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, బొబ్బిలి, చెన్నుబోయిన సత్యం, వెంకటరామిరెడ్డి, గణపతిరెడ్డి, రామిరెడ్డి, కొండ సతీష్, సోమయ్య, నోములు వెంకటేశ్వర్లు, దండి అప్పయ్య, తిరుపతయ్య, సురనేని రవి, పుచ్చకాయల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ శోభాయాత్రను ప్రారంభించిన సిపి , సు డ చైర్మన్, మున్సిపల్ కమిషనర్

## భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లతో ప్రశాంతంగా గణేష్ నిమజ్జన వేడుకలు



**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు - 23( జనంసాక్షి)**
గణేష్ నవరాత్రి ఉత్సవాలను తొమ్మిది రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం, పోలీస్ శాఖకు సహకరించిన భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ధన్యవాదాలు తెలిపారు. భక్తుల సమన్వయం, ఉత్సవ కమిటీల సహకారం, వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు.

బుధవారం స్థానిక ముస్తఫానగర్ చౌరస్తా వద్ద గణేష్ నిమజ్జన శోభాయాత్రను పోలీస్ కమిషనర్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మంత్రుల ఆదేశాల మేరకు గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. నిమజ్జనం కోసం ప్రత్యేక ఘాట్ సిద్ధం చేసినట్లు తెలిపారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అవసరమైన మౌళిక సదుపాయాలు, భద్రతా చర్యలు, ప్రజలకు మార్గనిర్దేశం చేసే ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు వివరించారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు చురుగ్గా పాల్గొంటూ తమ సహకారం అందించారని అన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, పోలీస్ శాఖ సూచనలను పాటించిన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది, పోలీసుల నిరంతర పర్యవేక్షణ తో,

గణేష్ విగ్రహాల నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకునే వరకు అవసరమైన భద్రతా పర్యవేక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. రాత్రంతా, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు పరిస్థితులను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు.

శోభాయాత్రలో పాల్గొనే భక్తులు, నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు. శోభాయాత్రలో క్రమశిక్షణ పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. నిమజ్జన సమయంలో అప్రమత్తంగా వ్యవహరించి, చిన్నారులు, వృద్ధులు, మహిళల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలందరూ సమన్వయంతో వ్యవహరించి, నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేసుకునేందుకు సహకరించాలని వారు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినప్పుడు వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో ఉత్సవ కమిటీలు, భక్తులు అందించిన సహకారం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు పరస్పర సహకారంతో



వ్యవహరించడం ద్వారా సోదరభావం, సామాజిక సమైక్యతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.

నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. పోలీస్ శాఖ, మునిసిపల్ అధికారులు, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అనంతరం ధంసలాపురం చెరువు వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు, శోభాయాత్ర నిర్వహణ, భద్రతా చర్యలను వారు స్వయంగా పర్యవేక్షించి, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రెసిడెంట్ వినోద్ లహోటి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. విద్యాసాగర్, జనరల్ సెక్రటరీ కె. జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్న కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అల్లిక అంజయ్య, ట్రెజరర్ ఎం. శ్రీహరి, సెక్రటరీ దోవలె సాయికిరణ్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



**నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, ప్రజల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 23 (జనంసాక్షి)**
గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. నిమజ్జనం సందర్భంగా పోలీస్ సిబ్బంది విధివిధానాలపై యంయంఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ కీలక సూచనలు చేశారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, జనసమ్మర్ధం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్‌లో సమయానికి హాజరై విధులు చేపట్టాలన్నారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాలు, నిమజ్జన కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విగ్రహాల ఊరేగింపులు నిర్దేశిత మార్గాల్లోనే సాగేలా చూడాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించాలన్నారు. నిమజ్జన వాహనాలపై అధిక సంఖ్యలో వ్యక్తులు ఎక్కకుండా, ప్రమాదకరంగా ప్రయాణించకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనే వారిపై, డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, బాణసంచా వంటి అంశాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిమజ్జన కేంద్రాల వద్ద బారికేడింగ్, లైటింగ్, రక్షణ సిబ్బంది ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయో పరిశీలించాలని అధికారులకు సూచించారు. నీటిలోకి ఎవరూ ప్రమాదకరంగా వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే రెస్క్యూ/మెడికల్ సిబ్బందితో సమన్వయం చేయాలన్నారు.

సిబ్బంది ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట మార్గనిర్దేశం చేస్తూ ప్రజల్లో విశ్వాసం పెరిగేలా విధులు నిర్వహించాలన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన చోటుచేసుకుంటే ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, అడిషనల్ డీసీపీ కుమారస్వామి, విజయకుమార్, ఏసీపీ రమణమూర్తి, ఎస్బి ఏసీపీ మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఆత్మీయుల కోలాహలం.. రాంప్రసాద్‌కు శుభాకాంక్షల వెల్లువ

- **ఘనంగా విద్యావేత్త, భారాస నాయకుడి జన్మదిన వేడుకలు**
- **ఫోన్లో శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

ఖమ్మం, (జనంసాక్షి) :
ఖమ్మం నగరంలోని 8వ డివిజన్ గోపాలపురంలో బుధవారం సందడి వాతావరణం నెలకొంది. ప్రముఖ విద్యావేత్త, భారాస సీనియర్ నాయకుడు గొల్లపూడి రాంప్రసాద్ జన్మదిన వేడుకలను స్థానిక నాయకులు, విద్యాసంస్థల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపురంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తల హర్షధ్వానాల నడుమ రాంప్రసాద్ కేకును కట్ చేశారు. అనంతరం అక్కడికి విచ్చేసిన వారికి స్వయంగా మిఠాయిలు తినిపించి ఆనందాన్ని పంచుకున్నారు. విద్యారంగంలో రాంప్రసాద్ అందిస్తున్న విశేష సేవలను, ప్రజా సమస్యల



పరిష్కారంలో ఆయన చూపే చొరవను పలువురు వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు.

**ఫోన్లో పువ్వాడ అభినందనలు**

రాంప్రసాద్ జన్మదినం సందర్భంగా రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రత్యేకంగా ఫోన్ చేసి ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాంప్రసాద్ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజా జీవితంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో భారాస 8వ డివిజన్ నాయకులు భూక్య అశోక్, మోహన్, ప్రముఖ



విద్యాసంస్థల ప్రతినిధులు సంపత్, సందీప్, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా రాంప్రసాద్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, యువజన విభాగం నేతలు, రాంప్రసాద్ స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని సందడి చేశారు.

# గిరిజన యువతకు ఉద్యోగ నైపుణ్య శిక్షణ

- **ఐటీడీఏ ఆధ్వర్యంలో 3?4 నెలల ఉచిత శిక్షణ..**
- **భోజనం, వసతి, యూనిఫామ్‌తో పాటు సర్టిఫికెట్..**
- **ఐటీడీఏ పీవో బి. రాహుల్..**



**భద్రాచలం సెప్టెంబర్ 23 (జనంసాక్షి)**
గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించ నున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లోని అర్హులైన యువతకు 3 నుంచి 4 నెలల పాటు వివిధ ఉద్యోగ నైపుణ్యాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

**- ఈ కోర్సుల్లో శిక్షణ:**

సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, బ్యూటీ థెరపిస్ట్, కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్, డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, మల్టీ స్కిల్ టెక్నీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువత కోర్సును బట్టి 5వ తరగతి, 8వ తరగతి, ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్ విద్యార్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు.

**- భద్రాచలం, ఇల్లందు, అశ్వారావుపేట, ఖమ్మంలో కేంద్రాలు.**

భద్రాచలంలోని గిరిజన భవన్ సమీప యూత్ ట్రైనింగ్ సెంటర్, ఇల్లందులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా, అశ్వారావుపేటలో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో, ఖమ్మంలోని రోటరీ నగర్ పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్లలో శిక్షణ నిర్వహించనున్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ కూడా జారీ చేయనున్నట్లు పీవో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న గిరిజన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం 9347466615, 8106141505, 9866113645, 9059667710, 6305802724 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.